

# భవానీద్వీపం

## –వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 47 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

తలల మీద రెండు చేతులూ జోడించి నృసింహుని నామస్మరణ చేస్తూ కొండదిగుతున్నారు ఆ భక్తులు. ఆరుగురు వున్నారు వారు. ఆరుగురూ యించుమించు ఒకే పోలికతో కనిపిస్తున్నారు. మానవులై వచ్చిన ఆరు శాస్త్రాలలా వున్నారు. ఆరు ఋతువులలా ఒకరి వెనుక ఒకరుగా వరుసగా ముందుకు సాగుతున్నారు. కొండ శిఖరాల మీదకు ముసురుకుంటున్న కరిమబ్బుల్లా వారి బలమైన భుజాల మీద పొడవాటి కేశాలు నాట్యం చేస్తున్నాయి. పెద్ద పెద్ద కనులు, కొనలు తేరిన తీరైన నాసికలు, దృఢమైన శరీరాలతో ఆకర్షణగా వున్నారు. నిరంతర తాంబూల చర్వణం వల్లనేమో అన్నట్లు ఎఱ్ఱని పెదాలు దొండపండ్లలా వున్నాయి. చిత్రంగా, వారి ముఖ కవళికలలో, శరీర భాషలో ఆడతనం, లేతదనం, నాజూకుదనం కనిపిస్తున్నాయి!

విరామం లేకుండా నామస్మరణ చేస్తూ వడివడిగా అడుగులేస్తుండడం వలన వారి శరీరాలు చెమటలతో అభిషేకం చేసినట్లు వున్నాయి. ఉదయకాలపు చల్లని గాలులు వీవనలు విసురుతూ చెమటలను ఆర్పి, వారి శరీరాలను చల్లబరుస్తున్నాయి.

తూర్పున సముద్రంనుండి అప్పుడప్పుడే పైకి లేస్తున్నాడు సూర్యుడు. కాలమనే పాము కాటుకు గురై చలనం లేకుండాపోయిన జీవులను బ్రతికించి లేపడానికి వైద్యుడిలా వస్తున్నాడు. పాపాల, శాపాల, రోగాల చీకట్లను చీల్చడానికి బాకుల్లాంటి కిరణాలతో పైకి లేస్తున్నాడు. గాలికి తెరలు తెరలుగా కదులుతున్న నీలి పరదాలా కనిపిస్తున్నది సముద్రం. పరదా మాటునుండి పసిపిల్లాడు తొంగిచూసినట్లు తోస్తున్నాడు బాలభానుడు.

వరుసగా ఒకరి తరువాత ఒకరు నృసింహ తత్త్వాలు ఆలపిస్తూనే వున్నారు ఆగకుండా. మిగిలినవారు వంత పాడుతున్నారు. భుజాలకు వ్రేలాడుతున్న మూటలు లయబద్ధంగా కదులుతున్నాయి. ఒక చేతితో చిడతలు వాయిస్తున్నారు. రెండవ చేతితో అభినయం చేస్తున్నట్లు ముద్రలు చూపిస్తున్నారు, గానానికి భావానుగుణంగా. క్రింద కొండచుట్టూ బొమ్మల్లా కనిపిస్తున్న ఇళ్ళు క్రమేపీ పెద్దవి అవుతున్నాయి. అంతకంతకూ తొలిగిపోతున్న మాయలా చీకటి తొలిగిపోతున్నది. భ్రాంతిలా దూరం కరిగిపోతున్నది.

కొంతసేపటికి కొండను పూర్తిగా దిగారు. కొండపాదంలో కాలిబాటకు ప్రక్కనున్న పెద్ద రావిచెట్టుకింద ఆగిపోయారు. పరస్పరం కూడబలుక్కున్నారు. వారు వెళ్ళాల్సిన మార్గం గురించి చేతులతో చూపించుకుంటూ నిర్ధారణ చేసుకుని ముందుకు కదిలారు. జయజయ నారసింహా అన్న నినాదం మరలా మారుమ్రోగింది. కొంతసేపటికి ఒక సంపన్నమైన వాడలో వున్నారు వారు.

ఇరువైపులా విలాసవంతమైన మేడలు కనిపిస్తున్నాయి. తోటలు, తోటలలో తూగుటుయ్యాలలు కనిపిస్తున్న విలాసవంతమైన భవంతులు. అక్కడక్కడా నెమళ్ళు కనిపిస్తున్నాయి. చిలుకల పలుకులు వినిపిస్తున్నాయి. విలువైన పరిమళ ద్రవ్యాల వాసనలు ఉదయపు చిరుగాలులకు ముక్కులకు సోకుతున్నాయి. ప్రహరీగోడల మీదుగా వీథిలోకి వాలిన కొమ్మల్లోనుంచి ముద్దమందారాలు ముద్దుగా దర్శనమిస్తున్నాయి.

ముద్దమందారాలు మూతులు ముడుచుకునేలా ముగ్ధల ముద్దుముఖాలు కనిపిస్తున్నాయి అక్కడక్కడ. ప్రొద్దున్నే పనిలోకి దిగిన పరిచారికల ముఖాలు అవి. కొద్దిగా ఆశ్చర్యము, కొద్దిగా కొంటెతనము, యింకొద్దిగా పరిహాసము కలగలిసిన చూపులు విసురుతున్నారు వీరి మీదకు. అందరిలోకీ చిన్నవాడిలా కనిపిస్తున్న యువకుడు ఒక భవంతి ముందు కళ్ళాపు చల్లుతున్న సుందరి ముందుకు వెళ్ళాడు. తనకు కావలసిన సమాచారం యేదో అడిగాడు, యేవో గుర్తులు చెప్తున్నట్లు సంజ్ఞ చేస్తూ.

ప్రహరీ గోడమీద మందార కొమ్మల మధ్యనుంచి ఒక ముద్దబంతి తొంగి చూసింది. 'ఎవరే? ఎవరు కావాలిట?' అని అడిగింది కళ్ళాపు చల్లుతున్న ముద్దమందారాన్ని. ముద్దమందారం వివరం చెప్పింది ముద్దబంతికి. ముద్దబంతి వీథిలోకి వచ్చింది. చేతిని ముద్దుగా మూడు నాలుగు మెలికలు తిప్పుతూ దూరంగా చూపిస్తూ ఏదో చెప్పింది యువకుడికి. అర్థమైంది అన్నట్లు తల పంకించి వెనక్కు వచ్చాడు ఆ యువకుడు.

ఆరుగురూ ముందుకు కదిలారు. కళ్ళాపు చల్లడం పూర్తి చేసి, ముగ్గు ముంతను అందుకున్నది ముద్దమందారం. తలలు వంచుకుని వడివడిగా అడుగులేస్తున్న ఆరుగురిని చూపించి ముద్దబంతి చిలిపిగా ఏదో అన్నది. యిద్దరూ పడిలేచే తరంగాలలా పడీ పడీ నవ్వుకున్నారు. ముగ్గుముంత చిన్నబోయేలా ముత్యాల పిండి వెదజల్లినట్లు నవ్వుతూనే వున్నారు!

కొంతసేపటికి మూడు నాలుగు వీథులు మారి, ఒక విశాలమైన వీథిలోకి వచ్చారు ఆ ఆరుగురు. ఈ వీథి యింకా విలాసవంతంగా వున్నది. రెండు, మూడు అంతస్తుల చలువరాతి మేడలు కనిపిస్తున్నాయి యెటు చూసినా. ఎక్కడ ఆగాలో, ఎటు వెళ్ళాలో తెల్చుకోలేనట్టు ఒక్క క్షణం నిలుచుండిపోయారు ఆరుగురు. రాజభవనంలా కనిపిస్తున్న ఒక సౌధం ముందు ఆగిపోయారు. పెద్ద పెద్ద వృక్షాలలా పెరిగిన నందివర్ధనం, గరుడవర్ధనం చెట్ల మధ్యన చలువరాళ్ళు పరిచిన వీధి అరుగులు వున్నాయి. ఒక అరుగుమీద కనిపించిన యువకుడి ముందుకు వెళ్ళారు వారు. అందరిలోకీ పెద్దవాడిలా కనిపిస్తున్న వ్యక్తి అడుగులు ముందుకువేశాడు. 'జై నరసింహ! అయ్యా! నమస్సులు!' అన్నాడు.

అరుగుమీది యువకుడు తలపైకెత్తాడు. చేతులు జోడించి అందరినీ పరిశీలనగా చూశాడు. 'జయ సింహాచలేశా' అన్నాడు కొంతసేపటికి. 'ఎవరు మీరు? ఎవరు కావాలి?' అని అడిగాడు. కొంతకాలంగా తన భక్తిరస ప్రవాహంతో, గానామృతంతో సింహాచలం చిగురించేలా చేస్తున్న యువకుడే అతడు. మోహనాంగి మోహంలో మునిగిపోయింది అతడి అందచందాలకే.

'కృష్ణమాచార్యులవారి కోసం తిరుగుతున్నాము స్వామీ! వారు ఎక్కడ వుంటారో చెప్పగలరా?'

వడిసెలలో రాయి విసిరినట్టు 'కృష్ణమాచార్యుల కోసమా? మీరెవరు?' అని వెంటనే అడిగాడు అరుగుమీది యువకుడు.

'మేము అహోబిల నారసింహుని సేవకులము. పాతకమూరు వాస్తవ్యులము. వీరు ఐదుగురూ నా తమ్ములు' తమ పరిచయం చేసుకున్నాడు సమాచారం అడిగినతడు.

చప్పున అరుగు దిగాడు ఆ యువకుడు. రెండు చేతులూ తలమీద చేర్చి జోడించాడు. 'నమో నమః పాతకమూరు భాగవతులా!' అని అడిగాడు సంభ్రమంగా. 'అవున'ని సమాధానం వస్తుండగానే మరలా అడిగాడు ఆ యువకుడు.

'మీరు అన్నదమ్ములు పుణ్యాత్ములు! మహా భాగవతులు! సాక్షాత్తూ అహోబిల నృసింహుడే మీ నృత్య గానాలకు ప్రేక్షకుడై పరవశించిపోతాడని అంటారే.. మీకా భ్రష్టుడు, వేశ్యాలోలుడు కృష్ణమాచార్యులతో ఎందుకు..' అని యింకా ఏదో అనబోయాడు ఆ యువకుడు.

అందరికన్నా చిన్నవాడిలా వున్న యువకుడు సింహాచల యువకుడి మాటలకు చప్పున అడ్డుపడ్డాడు. కొద్దిగా ఆవేశంగా, నొచ్చుకున్నట్లు 'తమకు తెలిస్తే కృష్ణమాచార్యులవారి నివాసం గురించి చెప్పండి. లేదంటే మేమే వెదుక్కుంటాం. ఆయనను నిందించే అవసరం యేముంది?' అన్నాడు పదునుగా.

సోదరులలో పెద్దవాడు శాంతించుమన్నట్లు చూశాడు తమ్ముడిని. సింహాచల గాయకుడివైపు తిరిగాడు. 'అయ్యా! దయచేసి కృష్ణమాచార్యులవారిని నిందించకండి. ఆయన కారణజన్ముడు. సాక్షాత్తూ నరసింహుడి అంశయే ఆయన రూపంలో జన్మించింది. అందుకే సింహాచలేశుడే ఆయనను తనకొండకు చేర్చుకున్నాడు. పుట్టు గుడ్డికి చూపునిచ్చాడు. పుట్టు మూగవాడిని మధుర గాయకుడిని చేసి, తన సేవ చేయించుకుంటున్నాడు. పర్లేదులెండి! యింకెవరినైనా అడిగి ఆయన జాడ తెలుసుకుంటాము' అని చేతులు జోడించి వెనక్కు మళ్లాడు.

సింహాచల గాయకుడి ముఖం చిన్నబోయింది. ఎందుకో కనులలో నీళ్ళు సుడులు తిరిగాయి. ' మన్నించండి..' అని ఏదో చెప్పబోయాడు. అతడి కంఠం గద్గదమైంది. పాతకమూరు భాగవతుడు రెండడుగులు వేసినవాడు ఆగిపోయాడు.

'అహోబిల నారసింహుడు మా నాట్యగానాలకు ప్రేక్షకుడై పరవశిస్తాడు అన్నారు. అదేమో కానీ, ఆయన కలలో కన్పించి ఆదేశించాడనే కృష్ణమాచార్యులవారిని దర్శించుకోడానికి వచ్చాము'

'నా అపరాధాన్ని మన్నించండి. యిది సానివాడ! మీలాంటివారు రావలసిన చోటు కాదు. యిక్కడ మీకు ఆ కృష్ణమాచార్యులు కనబడడు. అతడుండేది యిక్కడికి క్రోసు దూరం వుంటుంది. తమరు కొండ దిగిన తర్వాత పెద్ద రావిచెట్టును చూశారు కదా. అక్కడినుండి ఎడమవైపు తిరిగి ఈ వాడలకు వచ్చారు. అక్కడినుండి కుడివైపుకు తిరిగితే అరక్రోసు దూరంలో వుంటుంది అతడి నివాసం. వెళ్లి ఆ కృష్ణమాచార్యులను కలుసుకోండి' అని రెండు చేతులు ఎత్తి నమస్కరించాడు సింహాచల గాయకుడు.

ప్రతి నమస్కారం చేసి పాతకమూరు సోదరులు వెనుదిరిగారు. సింహాచల గాయకుడు అలానే చేతులు జోడించి నిలుచుండిపోయాడు. అతడి కనులవెంట చెక్కిళ్ళను కడుగుతూ అశ్రుధారలు ప్రవహిస్తున్నాయి. గాలివాటుకు అతడి భుజాలమీది ఉత్తరీయం తొలగిపోయింది.

' ముందే ఈ మూడు ముక్కలూ చెప్తే ఏమయ్యా? అనవసరంగా సాధునింద చేశావు!' అని మనసులో అనుకుంటూ అనుకోకుండా వెనుకకు తిరిగి చూశాడు అన్నదమ్ములలో ఆఖరివాడు. చేతులు జోడించి నిలుచుండిపోయిన సింహాచల యువకుడి ఎదురు రొమ్ము మీద కొట్టవచ్చినట్టుగా కనిపించింది పడగవిప్పిన నల్లత్రాచు చిహ్నం. ఒక్కసారిగా అతడి ఒళ్ళు గగుర్పొడిచింది. వెనుకకు తిరిగి అలా చూస్తూనే ముందుకు నడిచి, తన అన్నలను అందుకున్నాడు.

సింహాచల యువకుడికి తను ఎంతసేపు అలా నిలుచుండిపోయాడో తనకే తెలియదు. ధారలుగా కారుతున్న కన్నీటిని తుడుచుకోవాలనే ధ్యాస కూడా లేనట్లు వెనక్కు తిరిగాడు. భవంతివైపు చూడనైనా లేదు. పాతకమూరుసోదరులు వెళ్ళినవైపు కాకుండా యింకొక పక్కకు వడివడిగా అడుగులేశాడు. పరుగులాంటి నడకతో వీధి మలుపు తిరిగి కనిపించకుండా పోయాడు. కొంతసేపటికి భవంతి పై అంతస్తు నుండి కోకిల పాడినట్లుగా పిలిచిన ధ్వని వినిపించింది. తరువాత మెట్లమీదుగా మువ్వలు మోగిన ధ్వని వినిపించింది. తరువాత 'కృష్ణా! కృష్ణా!' అని పిలుస్తూ, సింహద్వారానికున్న పరదాలు తొలిగిస్తూ మోహనాంగి ముఖం కనిపించింది, మబ్బుల మాటునుండి చందమామలా.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS